కళాశాల విద్యార్థుల కథల పోటీలో ద్వితీయ బహుమతి పొందిన కథ

# తప్పదు మరి.....!

కన్నెగంటి చంద్రశేఖరరావు, బి. టెక్ విద్యార్థి, వరంగల్

"ఎందుకాపేశావ్?" ఆదుర్దాగా అడిగిందామె.

"రేడియేటర్‌లో వాటర్ పోయాలి" అతనన్నాడు మొహంమీద చెమట తుడుచుకుంటూ.

"ఇక్కడెక్కడుంది వాటర్?" నుదురు చిట్లించి చుట్టూ చూస్తూ అడిగింది ఎండిపోయిన పెదాలను నాలుకతో తడుపుకుంటూ.

"అదుగో అటువేపు చూడు! చెట్ల చాటుగా గుడిసెనో లేక పూరిల్లో కన్పించడం లేదూ! పొగ కూడా........" వేలుతో చూపిస్తూ అన్నాడు.

"ఇప్పు డక్కడి దాకా వెళ్ళి రావలసిందేనా?...."

"తప్పదు మరి!"ఇకముందైనా అంతకంటే దగ్గరగా రోడ్డు నానుకుని ఉన్న ఊళ్ళు లేవు సిటీ చేరేదాకా.

"నాకు దాహమూ వేస్తోంది. ఆకలిగానూ వుంది" నీరసంగా అందామె.

"ఆ హోటల్లో తిందామంటే కాదన్నావు."

"అబ్బ అది హోటలా, ఛీ ఛీ! దాని మాటెత్తకు నాకు కంపరం పుడుతుంది"

"సరే! నువ్విక్కడే ఉంటావా నాతో వస్తావా?"

"అమ్మో! ఇక్కడుండడమే!" నిర్మానుష్యంగా ఉన్న ఆ ప్రాంతాన్ని చూస్తూ బెదురుతూ అంది ఆమె. "నేనూ వస్తాను" పెద్ద వాటర్ బ్యాగ్ తీసుకుని అతను దిగాడు. ఆమె కూడా దిగింది.

"అబ్బ ఏమెండ! మాడ్చేస్తోంది కదూ!" అంటూ పైటచెంగును తలచుట్టూ కప్పుకుంది.

"ఊ!" అన్నాడు. "ఈ వెధవ రోడ్డు మీద యిన్ని గంటల ప్రయాణం....ఖర్మ! అందులోనూ మంచి ఎండలో బయలుదేరదీశావు. అక్కడేం మునుకుపోతుందని? ఈ బ్యాగ్‌లో వాటరైనా పోసి ఉండకూడదూ?"

"ఇట్లా ఉంటుం దనుకున్నానా నేను మాత్రం!" ఎండకు మాడుతున్న మొహాన్ని మరింత మాడ్చుకుంటూ అంది.

ఇద్దరూ రోడ్డు దిగి ఆ గుడిసె దిక్కుగా ముందుక్కదిలారు. వట్టి రాళ్ళు. ముళ్ళ కంపలు. ఎగుడు దిగుడు నేల.

సగం దూరం నడిచారో లేదో ఆమె అలిసిపోయింది. "అబ్బ! ఇక నావల్ల కాదు బాబూ" అంటూ కూలబడింది.

"లే! ఈ నాలుగడుగులేగా!" ఆమె చేయి పట్టుకుని లేపుతూ అన్నాడు.

ఆమె ఉస్సురంటూ లేచి అతనితోపాటు ముందుకు నడిచింది.

ఐదు నిముషాలు నడిచేసరికి "అబ్బా!" అంటూ బ్యాగ్ వదిలేసి బొటనవేలు పట్టుకున్నాడతను వంగి. "ఏమయింది?" ఆదుర్దాగా గాభరాగా అడిగిందామె.

"ఎదురు దెబ్బ" కళ్ళల్లో నీళ్ళు తిరుగుతుండగా అన్నాడతను.

"రక్తం కారుతోందా?"

"లేదులే!" పళ్ళు బిగబట్టుకుని లేస్తూ అన్నాడు.

ఆ మధ్యాహ్నపు మండే ఎండలో, ఆ ముళ్ళల్లో, రాళ్ళల్లో మౌనంగా మరో పదినిముషాలు నడిచాక ఆ గుడిసె చేరుకున్నారు. మబ్బుల్లేని ఆకాశం క్రింద నిశ్చలంగా నిలబడ్డ ఆ ఒంటరి గుడిసె ముందు వాళ్ళు రెండు శిలలలాగే నిలబడ్డారు. ఒకరి మొహంలోకి ఒకరు చూసుకున్నారు. తర్వాత ఇద్దరూ వాకిలి వేపు చూశారు. అతను మెల్లగా నిట్టూర్పి తడికె అడ్డు లేని వాకిలివేపు కదిలాడు. వాకిట్లో అడుగుపెట్టి, లోపలినుంచి వచ్చేపొగకు కళ్ళు మూసుకుని, మెల్లిగా తెరిచే ప్రయత్నంలో ఉన్నప్పుడు వినిపించిందతనికి.

"ఎవరూ? ఎవరూ అంటే పలకవేం?"

మరింత దగ్గరగా వచ్చిన ప్రశ్నకు అతి కష్టంమీద కళ్ళు విప్పి ఏదో చెప్పేలోగా మళ్ళీ ప్రశ్నించిందా ఆకారం "ఎవరు కావాలి?"

"వాటర్....ఉహూ....నీళ్ళు కావాలి."

ఆ ఆకారం యాభైయేళ్ళ ముసలావిడ. ముసలితనం వయసు మూలాన కాక పేదరికం మూలాన వచ్చినట్లుంది. చినిగిపోయిన బట్టలు. వదులవుతూ జారి ముడతలు పడే మొహంమీది తోలు. పొడుగు, నలుపు, అతని కళ్ళకు వికారంగా ఉంది.

"మంచినీళ్ళా?" సగం తెల్లబడ్డ జుట్టులో వేళ్ళు దూర్చి గోక్కుంటూ అంది.

"కాదు. మా మూలు నీళ్ళే కారులో పోయాలి. ఇదుగో ఈ డబ్బాలో పట్టుకు పోతాము" అప్పుడు చూసింది ముసలామె అతని వెనక నిల్చున్న ఆమెను.

"మీ రిద్దరేనా వొచ్చింది?"

"అవును."

"మరి ఇంట్లో నీళ్ళు లెవ్వు. బాయికాడికెళ్ళాలి. ఇటురా చూపిస్తా" అంటూ బయటికి వచ్చింది. "అదుగో అక్కడ రాళ్ళగుట్ట లేదూ! దానెనకమాల. మా ముసలాడూ పెద్దాడూ బాయికాడే ఉంటారు. ఎల్లి తోడిచ్చుకో."

అతను మెల్లగా చెమట తుడుచుకుంటూ అటువేపు నడిచాడు.

అతన్నే చూస్తూ అలాగే నిల్చున్న ఆమెతో అంది ముసలామె. "రామ్మాయ్ రా! లోపల కూసుందువుగాని."

ఇద్దరూ లోపలికెళ్ళారు. ఎప్పుడూ ఎరగని పొగకు ఆమె కళ్ళంబడి నీళ్ళొచ్చాయి. మూల నుండి చింకి చాప తెచ్చి కూచోమంది—పరిచి ముసలావిడ. పొగకు కళ్ళు అలవాటు పడ్డాక గుడిసెలో కనిపించింది ఒక మూలగా మూడు రాళ్ళమీద కుండా, కుండకింద మండుతూ, ఆరిపోతూ ఉన్న పుల్లలూ. చుట్టూ నలుగురు పిల్లలు. పదేళ్ళలోపు పిల్లలు. ఒకరికీ ఒంటిమీద బట్టలు సరిగ్గా లేవు. ఇద్దరు దీక్షగా ఆమెవైపే చూస్తున్నారు. ఇద్దరు ఆమెవేపు ఓ క్షణం చూసి మళ్ళీ తల తిప్పి కుండవేపే చూస్తున్నారు.

ముసలామె పొయ్యి దగ్గరకెళ్ళి, ఊదుతూ అడిగింది. "ఏ వూరమ్మాయ్ మీది?"

చెప్పిందామె.

"అబ్బో! చాన దూరమే! ఆఁ....అయినా యెంత దూరంలే! కారుందంటివిగా! మీ ఇద్దరూ మొగుడూ పెళ్ళాలా?"

"ముక్కూ మొహం తెలీని ఆ ముసలావిడ యెదుట సిగ్గు పడుతూ అందామె. "ఇంకో నెలలో పెళ్ళి."

"ఎక్కడ్నుంచసలు మీ రొచ్చేది?"

చెప్పిందామె "పెళ్ళికి వెళ్ళి వస్తున్నాం. స్నేహితులది. వెళ్ళేప్పుడు దారి బాగానే ఉంది. మళ్ళీ వర్షానికి....అదసలే మట్టిరోడ్డు....తెగిపోయి....గతుకులు....ఛండాలం....ఛీఛీ!"

"బాగ ఎండలో బయలుదేరి ఉంటారు పాపం! అసలే నాజూకోల్లు. ఈ పల్లెటూళ్ళ రోడ్డులు ఎట్ట....అయ్యో మరిసేపోయాను. నువ్వసలు మంచినీళ్ళు తాగలేదుగా! ఒరేయ్ సిన్నాడా! లేసి మంచినీళ్ళు ముంచియ్యరా!" వాళ్ళల్లో చిన్నాడు లేచి తెల్లగ్లాసుతో మంచినీళ్ళు ముంచిచ్చాడామెకు.

బట్టలు లేని వాణ్ణీ, నాడి మురికి ఒంటినీ, అల్యూమినియం గ్లాసునూ, చూసి ఆమెకు కంపరం పుట్టుకొచ్చింది. అటువంటి దారిద్ర్యమూ, అసహ్యమూ నిండిన వాతావరణంలో చిక్కుకోవలసిన తన పరిస్థితికి తనను తాను తిట్టుకుంది. తిట్టుకుంటూనే ఎండిపోయిన గొంతుతో కషాయంలా తాగేసింది కళ్ళు మూసుకుని.

"మొన్నట్ల తుపానులాగ వొచ్చింది గదా వాన! మళ్ళీ ఇయ్యాల చూడు ఎండ యెట్టా మండిపోతాందో! ఇక పంటలు మాత్రం ఎట్ట పండుతయి పండమంటే. ఏం కరు వొచ్చి పడిందిలే యిక్కడ—నిరుడూ పంట ల్లెవ్వ ఆ దిక్కుమాలిన తుపాను మూలాన. ఈ ఏడు అసలు వాన లేక కరువయిపోయె. తిండిగింజల గూడ కరువొచ్చి పడింది. ఊళ్ళో జనం సగం మంది లేసేపోయారు. ఊరు ఇక్కడికి దూర మేలే కొద్దిగా. మేము నేలకు కాపలా కాసే వోళ్ళం. ఇప్పుడు నేలూ లేవు కావలా లేదు. ఇంక యెట్ట బతకాలో! ఏ బాయితో సూసినా సుక్క నీరుండటంలా. ఎట్టాగో దేముడి దయ వొల్ల తాగే నీళ్ళకు కరువు లేదులే. ఇక్కడే ఒక బాయి ఉంది మా కింద, ఊళ్ళో మారాజులు సల్లగుంటే మాకూ కాత్త పోసే త్తారు. పొద్దుటినుంచి ఇప్పుడుదాక తిరిగితే గిద్దెడు గింజలు దొరకలేదు."

ముసలామె కుండను దించి గంజి వార్చింది. పిల్లలందరూ యింకా దగ్గరగా జరిగారు. "ఆగండ్రా! ఆరనియ్యండి!"

"సెపితే యిని సావరు" విసుక్కుంటూ వాళ్ళ చేతుల్లో ఉన్న పళ్ళాల్లో తలా కాస్త పోసింది.

"ఇంకా రాలేదే మా బావ?"

"వత్తా దొత్తాడు. యెండలో యెల్లి రావద్దూ!"

ముసలామె ఆమె దగ్గరిగా వచ్చి అంది మెల్లగా.

"నీ సీరా, జాకీటూ ఇప్పు" ఏ భావమూ లేని గొంతు.

"ఊ?....ఏమిటి....? ఎందుకు?...." అయోమయంగా అన్నదామె బిత్తరపోయి.

"ఎందుకేంది? వానాకాలం, సలికాలం, సలికి యెట్టా సత్తన్నమో నీ కెట్ట తెలిసిద్ది. కప్పుకో డానికి దుప్పటి లేదు. కట్టుకోడానికి గుడ్డలు లేవు. పిల్లలు సూడు యెట్టుండారో గుడ్డ ల్లేకుండా. ఇప్పు తొందరగా."

నిశ్చయంగా అది అడుక్కోవడం కాదు. "ఇప్పకపోతే?"

"నే నిప్పుకోలేనేంది! మీ పట్నపోళ్ళ బలం నాకు తెలవదా ఏంది?

"పోలీసు రిపోర్టు యిస్తే యేం చేస్తావు?"

"పెట్టెలనిండా రంగు రంగుల సీరలు, జాకీట్లు పెట్టుకుని. మల్లీ యీ యెధవ సీరా జాకెట్టూ కోసం పోలీసోల్లకాడికి కెలతావా? సిగ్గెట్టాలేక పోయిందమ్మా ముందు యిడువు."

ఆమె బెదిరిపోయింది. మెల్లిగా ఒక్కొక్క హుక్కూ తీసి జాకెట్ విప్పింది. చీర ఇడువు మెల్లిగా నవ్వుతూ మళ్ళీ అంది ముసలామె. ఆమె నున్నటి భుజాలు చూస్తూ "ఎన్నపూసలా గుండావు. నేనే పనేముంది?

ఆమె చీర విప్పింది.

"అబ్బో! ఈ లంగా బలే మెరుత్తుందే" తన నిస్సహాయ స్థితికీ, సిగ్గుకూ ఆమె కళ్లం బటి నీళ్లు తిరిగాయి.

"అడుగో వత్తన్నాడు నీ కాటోయే మొగుడు" బయటి కెళ్ళి చూస్తూ అంది ముస లామె.

ఆమె బయటికొచ్చింది. ఎండకు వీపూ భుజాలూ మండిపోయాయి. అతను వాటర్ బ్యాగ్ బరువుగా మోస్తూ వస్తున్నాడు. ఒంటి నిండా చెమట కారుతుంది. ఒంటిమీద డ్రాయర్ తప్ప మరేం లేదు. అతని వెనక మరొక యువకుడు, ముసలామె పెదకొడుకు. ఆ యువకుని చేతిలో అతని ప్యాంట్, షర్టూ.

"మరిసిపోయా! ఆ సెప్పులు ఇడువు, సలి కాలం ఈ ముళ్లల్లో రాళ్లల్లో పొద్దున్నే లేసి ఎల్లంటే కాళ్ళెట్ట మండిపోతయ్యని?" ముస లామె చెప్పులు లాక్కుని ఇంట్లో కెళ్ళింది.

ఆమె కిక దుఃఖం ఆగింది కాదు ఈ అవ తారాలతో ఇళ్ళ కెట్లా వెళ్ళడం? అతనూ దగ్గ రికి వచ్చేశాడు. అతనికి పరిస్థితి అర్థమయ్యింది. ఆమె వెక్కుతూ వెక్కుతూ అతని చేయి పట్టుకుంది.

గాలి వీచని ఆ మధ్యాహ్నపు ఎండలో ఎప్పుడూ ఎరగని ఆ రాళ్ళల్లో, ముళ్ళల్లో, చెప్పుల్లేని సున్నితమైన కాళ్ళతో, తలా, కాళ్ళూ మాడిపోతుంటే బరువుగా వగరుస్తూ అతనూ, మధ్య మధ్య వెక్కి వెక్కి ఏడుస్తూ ఆమే మెల్లిగా కారువేపు నడిచారు. □



# స్వప్నసింహాసనం



యద్దనపూడి సులోచనారాణి

సీరియల్

**17**

సుధీర్ నిశ్చేష్టుడైనట్టు చూస్తున్నాడు.

స్వప్న చూపుల్లోగాని, కదలికలోగాని, రవంత కూడా తడబాటులేదు! తను చేయదల్చుకున్నదేదో సుస్పష్టంగా తెలిసిన స్థిరత్వం ఆ ముఖంలో కన్పిస్తోంది! జీవితం అంటే నిర్భయత్వం, విశాలమైన ఆ కనుదోయిలో ప్రతిబింబిస్తోంది!

అతను స్వప్ననే రెప్పవాల్చడం మర్చిపోయినట్టు చూస్తున్నాడు!

స్వప్న దూరంగా వెళ్ళిపోవటానికి నిశ్చయించుకుంది! సుదూరంగా వెళ్ళిపోవ టానికి సిద్ధమౌతోంది? తను అందుకోలేనంత దూరం అది! ఆ క్షణంలో స్వప్న క్రైస్తవ మతప్రచారకురాలిగా అతని కళ్ళముందు కన్పిస్తోంది! నో! నో! యిది జరగటానికి వీల్లేదు! సుధీర్ దవడ ఎముక బిగిసింది! అతని ముఖంలో క్రమంగా రక్తం పొంగుకువస్తున్నట్టు కందిపోయింది!

మనసులో ఆవేశాన్ని అతను ఒక్కబట్టుకున్నాడు.

"స్వప్నా! నువ్వు తీసుకున్న నిర్ణయం సరైనది కాదు!" అస్పష్టంగా అన్నాడు.

"నాకు సరైనదిగానే తోస్తోంది!"

"నో! నువ్వు ఆవేశంలో వున్నావు! నేను చేసిన తప్పుకి నీకు నువ్వు శిక్ష విధించుకుంటున్నావు! ఇది చాలా అన్యాయం!"